సాక్షి చిత్తూరు

గురువారం, 16, అక్టోబర్, 2025



'బ్లాక్‌రైస్' బంగారమే!

బ్లాక్‌రైస్‌ను సేంద్రీయ పద్ధతుల్లో పండించేందుకు ఎక్కువ మంది రైతులు ఆసక్తి చూపుతున్నారు. - 10లో



టమా'రా'

జిల్లాలో టమాట ధరలు నెలరోజులుగా బాక్స్ రూ.200 దాటడం లేదు. దీంతో రైతులకు గిట్టుబాటు కావడం లేదు. - 10లో



పుత్తూరులో భారీగా ఇసుక డంపింగ్

పుత్తూరులో పెద్ద ఎత్తున ఇసుక డంపింగ్ చేశారంటూ సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టింది. - 10లో

న్యూస్‌రీల్

రేపు కలెక్టరేట్‌లో డీవీఎంసీ సమావేశం

చిత్తూరు కలెక్టరేట్ : ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం, పౌరహక్కుల రక్షణ చట్టం అమలుపై ఈనెల 17న జిల్లా నిఘా, పర్యవేక్షణ (డీవీఎంసీ) కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ విక్రమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 17న ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశం కలెక్టర్ అధ్యక్షత వహిస్తారని తెలిపారు. జిల్లాలోని డీవీఎంసీ కమిటీ సభ్యులు సమావేశానికి తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

డీఎస్‌డీవోగా బాలాజీ కొనసాగింపు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారి (డీఎస్‌డీవో) గా బాలాజీని కొనసాగిస్తూ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ భరణి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది నవంబర్ 30వ తేదీన డీఎస్‌డీవో బాలాజీ ఉద్యోగ విరమణ పొందనున్నారు. అయితే ఇటీవల ఆయన స్థానంలో మరొక అధికారిని నియమించారు. ఇటీవల జారీ చేసిన ఉత్తర్వులో సవరణ చేస్తూ ప్రస్తుతం ఉన్న బాలాజీ నవంబర్ నెల ఆఖరి వరకు అదే పోస్టులో కొనసాగుతారని పేర్కొన్నారు. ఆయన ఉద్యోగ విరమణ అనంతరం సత్యసాయి జిల్లా డీఎస్‌డీవోగా పనిచేస్తున్న ఉదయ భాస్కర్ చిత్తూరు డీఎస్‌డీవోగా బాధ్యతలు స్వీకరించనున్నారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం పోస్టుల దరఖాస్తులపై అనుమానాలొద్దు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : ఎన్‌హెచ్‌ఎం(నేషనల్ హెల్త్ మిషన్) పలు పోస్టుల దరఖాస్తు విషయంలో అభ్యర్థులకు ఎలాంటి అనుమానాలు వద్దని డీఎంహెచ్‌ఓ సుధారాణి తెలిపారు. ఇచ్చిన గడువు వరకు దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందన్నారు. అసత్య ప్రచారాలను నమ్మొద్దని తెలిపారు.

నేడు ఐఓసీఎల్ బాట్లింగ్ ప్లాంట్ ప్రారంభం

వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని

పూతలపట్టు(యాదమరి) : మండలంలో నూతనంగా నిర్మించిన ఐఓసీఎల్ ఇండేన్ బాట్లింగ్ ప్లాంట్‌ను నేడు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించనున్నారు. మండల పరిధి తలపులపల్లి పంచాయతీలోని ఎర్రచెరువుపల్లి వద్ద దాదాపు 40 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించారు. నేడు ప్రధాని కర్నూలు పర్యటన నిమిత్తం వస్తున్న నేపథ్యంలో ఆయన అక్కడి నుంచే వర్చువల్‌గా ప్రారంభించనున్నారు.

విద్యుత్ సేవల్లో అలసత్వం తగదు

చిత్తూరు కార్పొరేషన్ : ప్రజలకు విద్యుత్ సేవలందించడంలో ఎలాంటి అలసత్వం తగదని ఏపీఎస్పీడీసీఎల్ డిస్కం డైరెక్టర్ అయూబ్‌ఖాన్ అన్నారు. బుధవారం విద్యుత్ శాఖ చిత్తూరు సర్కిల్ ప్రథమ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఆటంకాలు ఉండకూడదన్నారు. పీఎం సూర్యఘర్ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్, ఈఈలు సురేష్, భాస్కర్‌నాయుడు, మునిచంద్ర, డీఈఈలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పెద్దిరెడ్డి, వేదికపై భూమన, నారాయణస్వామి, రాజశేఖర్‌రెడ్డి, ఎంపీ గురుమూర్తి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీలు సిపాయి సుబ్రమణ్యం, భరత్, మాజీ ఎంపీ రెడ్డెప్ప, సమన్వయకర్తలు మధుసూదన్‌రెడ్డి, అభినయ్‌రెడ్డి, విజయానందరెడ్డి, సునీల్‌కుమార్, వెంకటేగౌడ, విద్యార్థి విభాగం నేత హర్షిత్‌రెడ్డి తదితరులు

పోరుకు సిద్ధం



'' కూటమి అక్రమాలను అడ్డుకుంటాం.. అరాచకాల అంతుచూస్తాం.. నకిలీ మద్యంపై ఉద్యమిస్తాం.. సీబీఐ విచారణ వేయాలని డిమాండ్ చేస్తున్నాం.. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సమష్టిగా పోరాడుతాం.. కార్యకర్తలకు అడుగడుగునా అండగా నిలుస్తాం.. కక్ష సాధింపు చర్యలకు భయపడం.. చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్‌ను ఎండగడతాం.. నిరంకుశ పాలనకు మంగళం పాడే వరకు విశ్రమించం.. సంక్షేమ రాజ్యం తీసుకువచ్చేందుకు అవిశ్రాంతంగా కృషి చేస్తాం'' అని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి స్పష్టం చేశారు.



నకిలీ మద్యంపై నిరసన తెలుపుతున్న మహిళలు, వైఎస్సార్‌సీపీ నేతలు

కల్తీ మద్యంపై ఉద్యమిస్తాం

- సిట్ కాదు సీబీఐ విచారణ కావాలి
- నకిలీ మకిలీని ఆపాదిస్తే సహించం
- అక్రమ కేసులు.. అరెస్టులకు భయపడం
- వైఎస్సార్‌సీపీ జిల్లాస్థాయి సమావేశంలో పెద్దిరెడ్డి, భూమన

సాక్షి ప్రతినిధి, తిరుపతి/మంగళం : ప్రజలు కొనుగోలు చేస్తున్న ప్రతి నాలుగు మద్యం బాటిళ్లల్లో ఒకటి నకిలీదేనని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆరోపించారు. బుధవారం తిరుపతి పద్మావతిపురంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో భూమన కరుణాకరరెడ్డి అధ్యక్షతన విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. మాజీ డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, ఎంపీ గురుమూర్తి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, చిత్తూరు పార్లమెంట్ ఇన్‌చార్జి రాజశేఖర్‌రెడ్డి, నియోజక వర్గ సమన్వయకర్తలు, ఎమ్మెల్సీలు, అనుబంధ సంఘాల నేతలు పాల్గొన్నారు. పెద్దిరెడ్డి మాట్లాడుతూ పక్కా ఆధారాలతో నకిలీ మద్యం బాగోతం బయటపడితే అందులో నుంచి తప్పుకునేందుకు చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. సిగ్గులేకుండా సిట్ విచారణ వేశారని, అందులో తనకు కావలసిన అధికారులను నియమించుకున్నారని ఆరోపించారు. దమ్ముంటే సీబీఐ విచారణకు ఆదేశించాలని సవాల్ విసిరారు. భూమన మాట్లాడుతూ రాబోయే వైఎస్ జగన్ పాలనలో కార్యకర్తలదే కీలకపాత్ర అని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే పార్టీలో ప్రక్షాళన చేపట్టారని, పాలనలో కార్యకర్తల భాగస్వామ్యం ఉంటుందని వెల్లడించారు. మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ సిట్ విచారణకు భయపడే వ్యక్తిని కాదని, నిజాయితీగా ఉన్నాను కాబట్టే ఆవేశంగా మాట్లాడతానని తెలిపారు. ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ పార్టీకి ప్రాణవాయువు కార్యకర్తలే అన్నారు. ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ దురాగతాల పోరాటానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. చిత్తూరు పార్లమెంట్ ఇన్‌చార్జి రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావడం చారిత్రాత్మక అవసరమని స్పష్టం చేశారు. సమావేశంలో ఎమ్మెల్సీలు సిపాయి సుబ్రమణ్యం, భరత్, మాజీ ఎంపీ రెడ్డెప్ప, మాజీ ఎమ్మెల్యేలు బియ్యపు మధుసూదన్ రెడ్డి, లలితా థామస్, వెంకటేగౌడ్, సునీల్‌కుమార్, సమన్వయకర్తలు విజయానందరెడ్డి, భూమన అభినయ్, నూకతోటి రాజేష్, నేతలు అనీషారెడ్డి, చెవిరెడ్డి హర్షిత్ పాల్గొన్నారు.

త్వరితగతిన కమిటీల నియామకం

కూటమి ప్రభుత్వ అరాచకాలపై ఉద్యమం ఉధృతం చేసేందుకు గ్రామస్థాయి, వార్డు, మండల, జిల్లా, పార్లమెంట్ కమిటీల నియమాకాలను త్వరితగతిన పూర్తి చేయాలని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, భూమన కరుణాకరరెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు నియోజకవర్గాల సమన్వయకర్తలు, అనుబంధ సంఘాల అధ్యక్షులు చర్యలు తీసుకోవాలని కోరారు. అక్రమ కేసులు, అరెస్టులపై పోరాటం సాగించేందుకు జగనన్న సైన్యం సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

అద్భుత స్పందన

తిరుపతిలో బుధవారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ జిల్లా సమావేశానికి అద్భుత స్పందన లభించింది. కేవలం ఒక రోజు ముందుగా సమాచారం ఇచ్చినా తిరుపతి, చిత్తూరు జిల్లాల నలుమూలల నుంచి వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. సమావేశం అనంతరం నకిలీ మద్యంపై సీబీఐ విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టారు. కల్తీ మద్యంపై ప్రశ్నించారని నవీన్, వెంకటేష్‌పై ప్రభుత్వ ఒత్తిడితోనే పోలీసులు అక్రమంగా కేసులు పెట్టారని మండిపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన చేరుకుని ఆందోళనను విరమింపజేసేందుకు యత్నించారు.

తప్పుడు ఆరోపణలు

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో ఆవు కొవ్వు కలిసిందంటూ చంద్రబాబు తప్పుడు ఆరోపణలు చేశారు. తన అనుకూల సిట్ అధికారులతో విచారణ జరిపించి సుప్రీంకోర్టుతో మొట్టికాయలు వేయించుకున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మద్యం కుంభకోణం జరిగిందని మరో సిట్ వేశారు. ఎలాంటి ఆధారాలు లేకపోయినా చాలామంది వైఎస్సార్‌సీపీ నేతలను జైళ్లకు పంపారు. ఇప్పుడు కల్తీ మద్యం కేసులో తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుక మరో సిట్‌ను ఏర్పాటు చేశారు. ఇబ్రహీం పట్నంలో తయారు చేస్తున్న కల్తీ మద్యం డంప్‌ను పట్టించిన వైఎస్సార్‌సీపీ నేత జోగి రమేష్‌ను ఇందులో ఇరికించేందుకు యత్నిస్తున్నారు. చంద్రబాబుకు చిరకాల ప్రత్యర్థిని కాబట్టే నన్ను, నా కుటుంబాన్ని వేధించేందుకు తెగబడుతున్నారు.

– పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్

చంద్రబాబుకు ఎందుకు భయం

సీబీఐ విచారణ అంటే చంద్రబాబుకు ఎందుకంత భయం. సిట్ అధికారులైతే.. తాను అనుకున్న వారందరినీ దోషులుగా చిత్రీకరించేందుకు వీలుంటుందనే కుట్రలకు పాల్పడుతున్నారు. గతంలో ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు చిన్నచిన్న విషయాలకు కూడా సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేసేవారు. ఇప్పుడు మేము కోరినట్లు సీబీఐ విచారణ జరిపించాల్సిన బాధ్యత చంద్రబాబుకు లేదా? కల్తీ మద్యం మకిలిని వైఎస్సార్‌సీపీ నేతలకు అంటించేందుకు కుట్ర చేస్తున్నారు. మద్యం బాటిళ్లను స్కాన్ చేయడానికి యాప్‌ను కూడా రూపొందించామని కాకమ్మ కబుర్లు చెబుతున్నారు. రూ. వేల కోట్లు దోచుకున్న తర్వాత స్కాన్ యాప్‌లను రూపొందించి ప్రయోజనం ఏంటి. రాష్ట్రంలోని 4వేలకు పైగా మద్యం షాపులు కూటమి నేతల చేతిలో ఉన్నాయి.

– భూమన కరుణాకరరెడ్డి, వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు



నకిలీ మద్యం కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేస్తూ..



కూటమి ప్రభుత్వంపై ఉద్యమిస్తామని హెచ్చరిస్తూ..



అరాచక పాలనపై సమష్టిగా పోరాడుతామని స్పష్టం చేస్తూ..

కలానికి సంకెళ్లు!

- ప్రశ్నిస్తే కేసులు.. వేధింపులు
- జిల్లాలోని పాత్రికేయులపై అక్రమ కేసులు
- కూటమి ప్రభుత్వంలో పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు
- ప్రభుత్వ తీరుపై జర్నలిస్టు సంఘాల ఆగ్రహం

చిత్తూరు అర్బన్ : ప్రభుత్వాలకు, ప్రజలకు మధ్య వారధిగా పనిచేసే మీడియా సమాజంలో జరుగుతున్న పొరపాట్లను పాత్రికేయులు ఎత్తిచూపితే అధికారులు, పాలకులు పొరపాట్లను సరిచేసుకోవాలి. బాధితులకు న్యాయం చేయాలి. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. ప్రశ్నించే పత్రికలపై కేసులు పెడుతున్నారు. రాజ్యాంగం కల్పించిన భావ వ్యక్తీకరణ హక్కుకు సంకెళ్లు వేస్తున్నారు. మద్యంపై వార్తలు రాస్తున్నందుకు 'సాక్షి' పత్రికపై కక్షగట్టి కేసులు పెడుతున్నారు.

జిల్లాలో కేసులు ఇలా..

పత్రికలో ఏదైనా కథనం ప్రచురితమైతే అందులో ఉన్న విషయాన్ని గుర్తించి, లోటుపాట్లను సరిదిద్దుకోవాలి. తప్పుచేసిన వాళ్లపై చట్టపరంగా చర్యలు తీసుకోచ్చు. కథనంలో ఏదైనా తప్పుగా ఉందనిపిస్తే దాన్ని ప్రజాస్వామ్య పద్ధతిలో ఖండించవచ్చు. న్యాయపరంగా ముందుకు వెళ్లొచ్చు. ఇవన్నీ వదిలేసి వార్తలు రాసిన పాత్రికేయులే లక్ష్యంగా తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో జర్నలిస్టులపై కేసులు నమోదవడం ఆందోళనకు గురిచేస్తోంది.

- కుప్పం రూరల్ మండలంలో ఒకరు చనిపోతే శ్మశాన వాటికలో ఓ వర్గం అనుమతించలేదని, స్థానికంగా పోలీసులు కల్పించుకోవడంతో పరిస్థితి సద్దుమణిగిందంటూ సాక్షితో పాటు ఇతర పత్రికల్లోనూ వార్తలు ప్రచురితమయ్యాయి. కానీ స్థానిక సాక్షి విలేకరి నాగరాజుపై స్థానిక కూటమి నేతలు ఫిర్యాదు చేయడంతో ఈ ఏడాది జూన్‌లో కుప్పం పోలీసులు కేసు నమోదు చేశారు.
- కుప్పంలో హంద్రీ–నీవా కాలువ గేట్లలోకి పాము వచ్చిందని, గేటు మరమ్మతు చేసే సమయంలో నీళ్లు ఆగాయంటూ 'సాక్షి'లో వార్త ప్రచురితమయ్యింది. దీన్ని కొందరు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. దీంతో గత నెల 'సాక్షి' రిపోర్టర్లపై కుప్పం పోలీసులు కేసు నమోదు చేశారు.
- పుంగనూరులో ఓ మైనర్ బాలిక కనిపించలేదని పోలీసులు మీడియాకు చెప్పడంతో గతేడాది వార్త ప్రచురించారు. అయితే బాలిక హత్యాచారానికి గురయినట్లు పోలీసుల దర్యాప్తులో తేలి, నిందితులను అరెస్టు చేశారు. ఈ వివరాలు రాసినందుకు సాక్షి ఎడిటర్‌తో పాటు స్థానిక విలేకరి ప్రకాష్‌పై కేసు పెట్టారు.
- తిరుమలలో కల్తీనెయ్యి వ్యవహారంపై పాలకులు ఆరోపణలు చేయడం, దీనిపై సుప్రీం కోర్టు కల్పించుకుని విచారణకు ఆదేశించడం తెలిసిందే. తిరుమలలో జరిగి వాస్తవాలు బయటపెట్టినందుకు సాక్షి యాజమాన్యంపై కేసు నమోదు చేశారు.
- శ్రీకాళహస్తి నియోజకవర్గంలో జనసేన టీడీపీ నేతల మధ్య ఫ్లెక్సీ వివాదం తలెత్తింది. ఒకరి ఫ్లెక్సీ మరొకరు తొలగిస్తుండగా తొట్టంబేడు 'సాక్షి' రిపోర్టర్ హరీష్‌రెడ్డి వీడియో తీశారు. దీనిపై వార్త రాసినందుకు ఏప్రిల్‌లో అతని పై అట్రాసిటీ కేసు నమోదు చేశారు.



పాత్రికేయులపై అక్రమ కేసులను నిరసిస్తూ చిత్తూరులో ఆందోళన చేస్తున్న జర్నలిస్టు సంఘాలు (ఫైల్)

రాష్ట్రంలోనూ దారుణ పరిస్థితి..

మొలకచెరువులో కల్తీ మద్యం తయారుచేయడం, రాష్ట్ర వ్యాప్తంగా ఇది సరఫరా కావడంపై 'సాక్షి' పత్రికలో వరుస కథనాలు వస్తున్నాయి. దీన్ని జీర్ణించుకోలేని కూటమి ప్రభుత్వం సాక్షి ఎడిటర్‌కు నోటీసులు ఇవ్వాలని బుధవారం ఏకంగా హైదరాబాద్‌లోని సాక్షి ప్రధాన కార్యాలయానికి వెళ్లి ప్రశ్నల పేరిట ఇబ్బందికర పరిస్థితి సృష్టించారు. నెల్లూరు సాక్షి బ్యూరో ఇన్‌చార్జ్ మస్తాన్‌రెడ్డికి సైతం నోటీసులు ఇచ్చి, విచారణ పేరిట స్టేషన్‌కు పిలిపించారు.

ఆక్షేపణీయం



జర్నలిస్టులను ఏ ప్రభుత్వమైనా జర్నలిస్టులుగానే చూడాలి. యాజమాన్యాలతో ముడిపెట్టొద్దు. వాస్తవాలను రాసిందుకు కేసులు పెడుతూ పోవడం మంచి పద్ధతికాదు. ఇది ప్రతికా స్వేచ్ఛను హరించడమే. ఆది ఆక్షేపణీయం.

– మురళీకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏపీయూడబ్ల్యూజే

భావ వ్యక్తీకరణపై దాడి..



రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛగా మాట్లాడే హక్కుతో పాటు భావ వ్యక్తీకరణ వ్యక్త పరిచే హక్కును కల్పించింది. ప్రభుత్వాల్లో జరిగే తప్పులకు పత్రికలు ఎత్తి చూపిస్తాయి. ఇందులో తప్పేం ఉంది. ఆ మాత్రం దానికి పత్రికా కార్యాలయాల్లో సోదాలు చేయడం, పాత్రికేయులపై కేసులు పెట్టడం సరైంది కాదు.

– కెఎం.అశోక్‌కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి, ఏపీయూడబ్ల్యూజే

పోరాటలే శరణ్యం



పత్రికలు, పాత్రికేయులపై కేసులు పెట్టి నోళ్లు మూయిస్తామనుకునే ఏ ప్రభుత్వమూ మనుగడ కొనసాగించలేదు. జిల్లాలో పలువురు పాత్రికేయులపై కేసులు పెట్టారు. దీనిపై ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తూ ఆందోళనలు చేస్తున్నాం. ముున్ముందు ఇలాంటివి కొనసాగితే రోడ్డెక్కి పోరాటాలు చేయక తప్పదు.

– కాలేశ్వరరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఏపీయూడబ్ల్యూజే

రైతులకు అన్యాయం



రైతు ఆక్రందన సభలో మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు జనార్దన్

బంగారుపాళెం : మంచి ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తూ వారి కడుపు కొడుతోందని మామిడి రైతు సంఘం నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని బ్రహ్మానందాశ్రమం ఆవరణలో జిల్లా అధ్యక్షుడు జనార్దన్ అధ్యక్షతన మామిడి రైతు ఆక్రందన సభ నిర్వహించారు. గుజ్జు యజమానుల నుంచి అందాల్సిన రూ 370 కోట్లు చెల్లించే వరకు ఉద్యమం కొనసాగించాల్సిందేనన్నారు.

ఏపంటకూ గిట్టుబాటు లేదు.

రాష్ట్రంలో ఏ పంటకూ గిట్టుబాటు ధర అందడంలేదని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాకు చెందిన ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే గుజ్జుయజమానులను కట్టడి చేయడం పెద్ద పనికాదని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు భాస్కర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం, అధికారులు గుజ్జు ఫ్యాక్టరీ యజమానులకే అండగా ఉంటోందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ.. రైతు ఉద్యమాలకు రాజకీయం చేయడం స్థానిక ఎమ్మెల్యేకు తగదన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వాడా గంగరాజు మాట్లాడుతూ.., పల్ప్‌ను టీటీడీ, ఇతర సంస్థలకు సరఫరా చేస్తే గిట్టుబాటు ధర కల్పించడం సాధ్యమన్నారు.

సభను అడ్డుకునేందుకు కుట్రలు

మామిడి సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జనార్దన్, మునీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆక్రందన సభ అడ్డుకునేందుకు వారం రోజులుగా స్థానిక శాసనసభ్యులు తీవ్రంగా ప్రయత్నించారన్నారు. నియోజకవర్గంలో రూ. 4 చొప్పున 75 కోట్లు మంజూరు అయినందుకు అభిషేకాలు చేయడం గొప్పకాదని, 8 రూపాయలు చొప్పున రూ 150 కోట్లు మంజూరు చేయించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు హేమలత, మురళీ, ఏఎస్ఎఫ్ జాతీయ నేత శివారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సురేంద్ర, కోశాధికారి సంజీవరెడ్డి, ఉపాధ్యక్షుడు మునిరత్నంనాయుడు, ఉమాపతి నాయుడు, కార్యదర్శులు శ్రీనివాసులు, మోహన్‌రెడ్డి,సందీప్‌రెడ్డి, ఓబుల్‌రాజు, తవణంపల్లె మాజీ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నేత రవికుమార్, చెంగల్‌రాయరెడ్డి, ప్రభాకర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వలంటీర్ మృతి


సంతోష్ (ఫైల్)

పలమనేరు : మున్సిపాలిటీ పరిధిలోని నీళ్లకుంటకు చెందిన సంతోష్(35) మంగళవారం రాత్రి కర్ణాటక రాష్ట్రంలోని ముళబాగిళు వద్ద హైవేలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బెంగళూరు నుంచి బైక్‌పై స్వగ్రామానికి వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి చెందినట్లు అక్కడి పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ముళబాగిళు ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్యాపిల్లలున్నారు. గత ప్రభుత్వంలో నీళ్లకుంటలో వలంటీర్‌గా పనిచేస్తూ ప్రజలకు సేవలందించాడు. కూటమి ప్రభుత్వం వచ్చాక వలంటీర్ వ్యవస్థను తొలగించడంతో బతుకు తెరువు కోసం బెంగళూరుకు వెళ్లి అక్కడ డెలవరీ బాయ్‌గా పనిచేస్తుండేవాడు. దీపావళి పండగ కోసమని ఇంటికొస్తుండగా కానరానిలోకాలకెళ్లాడు. సంతోష్ మృతితో నీళ్లకుంటలో విషాదం అలుమకుంది.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి


విజయ (ఫైల్)

సదుం : అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలో బుధవారం వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు..కొత్తపల్లెకు చెందిన విజయ(45) భర్త చంద్రశేఖర్ గల్ఫ్‌లో ఉంటున్నాడు. ఆమె పీలేరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పనిచేస్తోంది. గత మంగళవారం ఉదయం విధుల కోసం వెళ్తూ తిరిగి రాలేదు. 15న ఉదయం విజయ మృతదేహాన్ని పుట్టావారిపల్లె బస్‌స్టాప్ సమీపంలో వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లే దారిలో గుర్తించిన కొందరు ఆమె కుమారులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పీలేరుకు తరలించారు. ఆమె కుమారుడు సాయికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. మృతికి గల కారణాలు పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది.

యువజనోత్సాహం


సాంస్కృతిక నృత్యాలు చేస్తున్న యువత

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో యువత ఉత్సాహంగా ఉల్లాసంగా పాల్గొన్నారు. బుధవారం జిల్లా కేంద్రానికి సమీపంలోని ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాలలో జిల్లా స్థాయి యువజనోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సెట్విన్ సీఈవో యశ్వంత్ మాట్లాడుతూ.. నేటి యువత స్వామి వివేకానంద సందేశాన్ని ఆదర్శంగా తీసుకుని ముందుకుసాగాలన్నారు. నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువజన అధికారి ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ.. జిల్లాలోని యువత కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో బాలాజీ, సెట్విన్ మేనేజర్ మోహన్‌కుమార్, జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి రాఘవులు పాల్గొన్నారు.

‘బ్లాక్‌రైస్’ బంగారమే!

- మాపిళ్లైసాంబ పేరిట పురాతన వరి రకం సాగు
- పంట నల్లగా.. బియ్యం ఎరుపు రంగు
- పలమనేరు డివిజన్‌లో 30 ఎకరాల్లో సాగు
- ఆన్‌లైన్ మార్కెట్‌లో కిలో రూ.200 పైమాటే


పలమనేరు : కూర్మాయి వద్ద సాగవుతున్న బ్లాక్‌రైస్

పలమనేరు : సాధారణంగా మనం తినే బియ్యం తెలుపు రంగులో ఉంటుంది. వరి పంట కాలం నాలుగు నెలలు మాత్రమే. అద్భుతమైన ఔషధ గుణాలున్న బ్లాక్ రైస్ రకం ఇప్పుడు రైతులకు వరంగా మారింది. గతంలో తమిళనాడు రాష్ట్రం కన్యాకుమారి ప్రాంతంలో అక్కడి పూర్వీకులు సహజ పద్ధతిలో సాగు చేస్తూ వరి విత్తనాలను కాపాడుకుంటూ వచ్చారు. అవే నేటి తరాలకు అందుబాటులోకి వస్తున్నాయి. తమిళనాడు ప్రాంతం నుంచి మాపిళ్లైసాంబ(బ్లాక్‌రైస్) విత్తనాలను తెచ్చి పలమనేరు మండలంలోని కూర్మాయి వద్ద ఓ ప్రకృతి రైతు చందూల్ కుమార్ ప్రయోగాత్మకంగా ఈ వంగడాన్ని కొన్నేళ్లుగా సాగు చేస్తున్నారు.

ఊపందుకున్న సాగు

పలమనేరు మండలంలోని కూర్మాయి గ్రామం వద్ద చందూల్ కుమార్ అనే ప్రకృతి రైతు మూడేళ్లుగా బ్లాక్ రైస్‌ను సాగు చేస్తున్నాడు. ఈ విడత సైతం తన ఎకరా పొలంలో ఈ వంగడాన్ని నాటాడు. ప్రస్తుతం వరి పంట ఆరు అడుగులకు పైగా పెరిగి ఏపుగా ఎన్ను పట్టింది. రైతు పూర్తిగా సేంద్రియ, సహజ పద్ధతిలో పంట సాగు చేశాడు. సాధారణంగా వరి పంట కాలం నాలుగు నెలలుగా ఉంటే దీనికి ఏడు నెలలుగా ఉంటుంది. ఈ రైతు పండించిన ఈ రకాన్ని చుట్టు పక్కల ప్రాంతాలే కాదు కర్ణాటక నుంచి సైతం రైతులు సందర్శించి వెళుతున్నారు. ఈ విడత పలమనేరు వ్యవసాయశాఖ డివిజన్‌లో 30 ఎకరాల్లో బ్లాక్‌రైస్ సాగు అవుతోంది.

దేశవాళి వరి వంగడాల్లో అగ్రస్థానం

హరితవిప్లవం తర్వాత పలు రకాల హైబ్రిడ్ వరి వంగడాలు సృష్టించబడి రెండు వేల దాకా వంగడాలు సాగులో ఉన్నాయి. అనాదిగా కొన్ని రాష్ట్రాల్లో మాత్రం దేశవాళి రకాలు వంశపారంపర్యంగా సాగులో ఉంటూ ఆ విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. ఇలాంటివి 26 కాగా వీటిలో అత్యంత పోషకాలు కలిగిన ఔషధ గుణాలున్న వరుసలో తొలిస్థానం మాత్రం బ్లాక్‌రైస్‌దే, అందుకే మార్కెట్‌లో దీనికి మంచి డిమాండ్ ఉంది.

కిలో ధర రూ.200 పైమాటే...

దుకాణాల్లో బ్లాక్ రైస్ పెద్దగా అందుబాటులో లేదు. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ లాంటి పలు కంపెనీలు కిలో నుంచి మూడు, ఐదు కిలోల బ్యాగుల్లో వీటిని ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్నారు. డీమార్ట్, బిగ్‌బాస్కెట్ లాంటి మాల్స్‌లోనూ అందుబాటులో ఉన్నాయి. కిలో రూ.160 నుంచి రూ.250 దాకా కంపెనీలను బట్టి ధరలున్నాయి.

మూడేళ్లుగా సాగు చేస్తున్నా..



నేను మూడేళ్ల నుంచి ప్రకృతి సేద్యంలో భాగంగా బ్లాక్‌రైస్‌ను సాగు చేశా. ఇప్పుడు పంట గింజ దశలో ఉంది. మంచి డిమాండ్ ఉన్న ఇలాంటి వరి వంగడాన్ని ఈ ప్రాంత రైతులకు పరిచయం చేసి సాగును పెంచాలని భావిస్తున్నా. ఇందులో ఎన్నో ఔషధ గుణాలున్నాయి. ముఖ్యంగా డయాబెటిస్ ఉన్న వారికి ఇది చక్కటి ఆహారంగా మారింది.

– చందూల్‌కుమార్, ప్రకృతి రైతు, కూర్మాయి, పలమనేరు మండలం

ఎర్రచందనం దుంగల కారు బోల్తా


కాటప్పగారిపల్లె జాతీయ రహదారి వద్ద ఎర్రచందనం దుంగలను తరలిస్తూ బోల్తాపడ్డ కారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు

- ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొనబోయి బోల్తాపడిన కారు
- తీవ్రంగా గాయపడిన ద్విచక్ర వాహన దారుడు
- 9 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్న పోలీసులు
- పరారైన స్మగ్లర్లు

బంగారుపాళెం: ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలిస్తున్న కారు బుధవారం ఉదయం చిత్తూరు జిల్లా, బంగారుపాళెం మండలంలోని కాటప్పగారిపల్లె వద్ద బోల్తాకొటింది. చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై అదుపు తప్పిన కారు డివైడర్‌ను దాటి ఎదురుగా వస్తున్న ఓ ద్విచక్ర వాహనదారున్ని ఢీకొట్టి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారులు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. పలమనేరు నుంచి చిత్తూరు వైపు వెళ్తున్న కారు(కేఏ05–ఎండి4456) కాటప్పగారిపల్లె సమీపంలోకి రాగానే అదుపు తప్పి జాతీయ రహదారిపై ఎడమ వైపు నుంచి డివైడర్‌ను ఢీకొని కుడివైపునకు దూసుకుపోయింది. కల్లూరుపల్లె పంచాయతీ, కొరివారిపల్లె నుంచి బంగారుపాళ్యానికి వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొని రహదారి పక్కన గల కాలువలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కొరివారిపల్లెకు చెందిన వెంకటస్వామి తీవ్రంగా గాయపడ్డాడు. బంగారుపాళెం ఎస్‌ఐ ప్రసాద్, సిబ్బందితో కలసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన ద్విచక్రవాహన దారున్ని బంగారుపాళెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎర్రచందనం దుంగలను కారులో అక్రమంగా తరలిస్తున్న స్మగ్లర్లు అప్పటికే పారిపోయారు. బోల్తాపడిన కారులో 9 ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించారు. పారిపోయిన స్మగ్లర్ల ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కారుతో సహా ఎర్రచందనం దుంగలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తీవ్రంగా గాయపడిన వెంకటస్వామిని మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎర్రచందనం దుంగలు ఎక్కడికి తీసుకువెళ్తునారో?

గతంలో తిరుపతి, చంద్రగిరి పరిసర ప్రాంతాల నుంచి బెంగళూరుకు ఎర్రచందనం అక్రమ రవాణా సాగేది. ఈ క్రమంలో బంగారుపాళెం స్టేషన్ పరిధిలో ఎర్రచందనం అక్రమ కేసులు నమోదయ్యాయి. కొన్ని సందర్భాలాలో ఇలా అక్రమంగా దుంగలు తరలిస్తూ కార్లు, టెంపోలు బోల్తాపడిన సంఘటనలు వెలుగుచూశాయి. ఇప్పుడు బెంగళూరు నుంచి చెన్నై వైపు ఎర్రచందనం దుంగలు అక్రమ రవాణా పోలీసులకు సైతం పలు అనుమానాలకు తావిస్తోంది. బెంగళూరు నుంచే వస్తున్నాయా? లేక జిల్లాలో ఎక్కడైనా డంప్ చేసి వాటిని తరలిస్తున్నారా..? అనే అనుమానం కలుగుతోంది.

ప్రజా సమస్యలు పట్టేనా?

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే జిల్లా పరిషత్ స్థాయి సంఘ సమావేశాలు ప్రతి సారి తూతూమంత్రంగా సాగుతున్నాయి. జిల్లాలోని ఆయా మండలాల్లో నెలకున్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించాల్సి ఉండగా ఆ దిశగా సమావేశాలు నిర్వహించడం లేదు. 16న జిల్లా పరిషత్‌లో నిర్వహించే స్థాయి సంఘాల సమావేశాలను సక్రమంగా నిర్వహించి ప్రజాసమస్యలను చర్చిస్తారో లేక మమ అనిపిస్తారో వేచి చూడాలి.

- కొన్ని శాఖలు అజెండాలే సమర్పించని వైనం
- ప్రతి సమావేశంలోనూ డుమ్మా కొడుతున్న ప్రజాప్రతినిధులు
- నేడు జిల్లా పరిషత్ స్థాయి సంఘ సమావేశం



చిత్తూరు కలెక్టరేట్ : కూటమి ప్రభుత్వ పాలనలో జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలు మొక్కుబడిగా నిర్వహించడం పరిపాటిగా మారింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో అనేక సమస్యలు కొట్టుమిట్టాడుతున్నా అవేమీ సమావేశంలో చర్చకు రావడం లేదు. ప్రజా సమస్యలపై ఏ మాత్రం దృష్టి పెట్టని దుస్థితి నెలకొంటోంది. సమావేశాలను కూటమి ప్రజా ప్రతినిధులు నీరుగార్చేలా చేయడం విమర్శలకు తావిస్తోంది. గురువారం నిర్వహించనున్న సమావేశాలను సజావుగా నిర్వహించి ప్రజా సమస్యలు చర్చిస్తారో నీరుగారుస్తారోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

డుమ్మా కొడుతున్న ప్రజాప్రతినిధులు

జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలకు హాజరు కావాల్సిన కూటమి ఎమ్మెల్యేలు డుమ్మా కొడుతున్న పరిస్థితి. ప్రతి సమావేశంలోనూ ఇదే తంతు నెలకొంటోంది. కూటమి ఎమ్మెల్యేలతో పాటు ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలు శాఖల అధికారులు సమావేశాలకు గైర్హాజరవుతున్నారు. పలు శాఖల అధికారులు స్థాయి సంఘాల సమావేశాలకు కనీసం అజెండాను సైతం ఇవ్వడం లేదు.

చర్చ జరిగేనా?

జిల్లాలోని దివ్యాంగులకు నిర్వహిస్తున్న రీ అసెస్‌మెంట్ ప్రక్రియలో సౌకర్యాల కొరత, డాక్టర్ల అలసత్వం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దివ్యాంగుల పింఛన్‌లను తొలగించేందుకు రీ అసెస్‌మెంట్ చేస్తున్నారంటూ భయాందోళన చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా వందలాది మంది కొత్త పింఛన్‌ల కోసం నిరీక్షిస్తున్నారు. పేదల గృహ నిర్మాణాల్లో ఎలాంటి పురోగతి ఉండటం లేదు. ఇసుక దోపిడీని అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. అక్రమ క్వారీలకు అడ్డుకట్ట వేయాలని, అక్రమ క్వారీల తరలింపును అరికట్టాలని క్షేత్రస్థాయిలో గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

అక్రమ స్కానింగ్ కేసులో ఇద్దరు సస్పెన్షన్

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో పనిచేస్తూ అక్రమ స్కానింగ్ కేసులో పట్టుబడిన ఇద్దరు వ్యక్తులను సస్పెండ్ చేసినట్లు డీఎంహెచ్‌వో సుధారాణి తెలిపారు. నెల రోజుల క్రితం గంగాధర నెల్లూరు మండల పరిధిలో పనిచేస్తున్న ఆశావర్కర్‌ను సస్పెండ్ చేశామన్నారు. మళ్లీ పోలీసులు ఇచ్చిన కేసు వివరాల ఆధారంగా పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి గుడిపాల మండలానికి చెందిన ఓ అటెండర్‌ను సస్పెండ్ చేశామన్నారు. ఈ కేసులో ఓ ఏఎన్‌ఎం ఉందనే ఆరోపణలు వచ్చాయని, పరిశీలిస్తే... ప్రైవేటు ఆస్పత్రిలో పనిచేసే సిబ్బంది అని ఆమె పేర్కొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

పులిచెర్ల(కల్లూరు) : రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. బోడిరెడ్డిగారిపల్లె పంచాయతీ ఆవుల పెద్దిరెడ్డిగారిపల్లె దళిత వాడకు చెందిన కాంతమ్మ(43) కల్లూరు –పీలేరు జాతీయ రహదారిలో దిన్నె బెస్తపల్లె బస్ స్టాప్ వద్ద నడుచుకొంటూ వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది.

పరిశ్రమల అభివృద్ధికి ప్రోత్సాహం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని పరిశ్రమల ఆధునీకరణ, పర్యావరణ పరిరక్షణ, పరిశ్రమల అభివృద్ధిని ప్రోత్సహించేందుకు చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఇండస్ట్రీయల్ పార్ట్‌నర్‌షిప్ డ్రైవ్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఇండస్ట్రీయల్ పార్ట్‌నర్‌షిప్ డ్రైవ్‌లో ఈనెల 15 నుంచి నవంబర్ 15 వరకు జిల్లాలో పలు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మామిడి సబ్సిడీ జమ కాని రైతులు ఈ నెల 30వ తేదీ లోపు జిల్లాలోని రైతు సేవా కేంద్రాలు, ఉద్యానవన శాఖ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏవైనా సందేహాలుకు 08572–242777 నంబర్‌లో సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జోనల్ మేనేజర్ సుబ్బారావు, జిల్లా జనరల్ మేనేజర్ సూరిబాబు పాల్గొన్నారు.

జూడో జిల్లా పోటీలకు ఎంపిక


క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

వడమాలపేట (పుత్తూరు) : ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ అండర్–19 జూడో జిల్లా జట్టుకు వడమాలపేట జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికయ్యారు. బుధవారం తిరుపతిలోని శ్రీనివాస క్రీడా సముదాయంలో జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న వడమాలపేట విద్యార్థినులు గీతశ్రీ 40 కిలోల విభాగం, అంజలి 48 కిలోల విభాగంలో ప్రథమ స్థానాలను కైవసం చేసుకొని ఉమ్మడి చిత్తూరు జిల్లా జూడో జట్టుకు ఎంపికయ్యారు. వీరు అక్టోబర్ చివరి వారంలో శ్రీసత్యసాయి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను స్కూల్ హెచ్‌ఎం కరుణా నవనీతం, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ప్రయాణికుల పడిగాపులు


చిత్తూరు ఆర్టీసీ బస్టాండులో బస్సు కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు


వెలవెలబోతున్న కుప్పం ఆర్టీసీ బస్టాండు

- పీఎం సభకు ఆర్టీసీ బస్సులు
- జిల్లా నుంచి 250 బస్సులు తరలింపు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కర్నూలులో గురువారం జరిగే పీఎం సభకు పెద్ద ఎత్తున ప్రజలను తరలించేందుకు జిల్లా నుంచి 250 ఆర్టీసీ బస్సులు కేటాయించారు. ఈ బస్సులు బుధవారం ఉదయం కర్నూలుకు బయలు దేరాయి. దీంతో అత్యధిక శాతం గ్రామీణ బస్సు సర్వీసులు రద్దయ్యాయి. దీంతో పాటు ఎక్స్‌ప్రెస్, సప్తగిరి బస్సులను కూడా పంపించేశారు. దీంతో వివిధ పనుల నిమిత్తం చిత్తూరుకు వచ్చిన ప్రయాణికులు తిరిగి వెళ్లేందుకు నానా అవస్థలు పడ్డారు. గత్యంతరం లేక ఆటోలు, ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు.

కుప్పం : పీఎం సభ జన సమీకరణ కోసం కుప్పం ఆర్టీసీ నుంచి 71 బస్సులను బుధవారం తరలించారు. కుప్పం ఆర్టీసీ డిపోలో నడుస్తున్నదే కేవలం 97 సర్వీసులు వీటిలో 71 బస్సులను సభలకు కేటాయించారు. దీంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. మరో మూడు రోజులు ప్రయాణికులకు అవస్థలు తప్పేలాలేవు.

అంతర పంటలతో ఆదాయం

చౌడేపల్లె : ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా అంతర పంటల సాగుతో అధిక ఆదాయం సాధ్యమని డీపీఎం వాసు సూచించారు. బుధవారం జనజాగృతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అనంతపురానికి చెందిన రైతులు చౌడేపల్లె, పుంగనూరు మండలాల్లో పర్యటించి 15 రకాల అంతర పంటల సాగును సందర్శించారు.

అవకతవకలుంటే వేటు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న పలు అభివృద్ధి కార్యక్రమాల రికార్డుల్లో అవకతవకలుంటే వేటు ఖాయమని సమగ్రశిక్షాశాఖ అకౌంట్స్ ఆఫీసర్ నాగరాజు హెచ్చరించారు. బుధవారం కణ్ణన్ ప్రభుత్వ పాఠశాలలో 58 పాఠశాలల సోషల్ ఆడిట్ నివేదిక నిర్వహించారు. పలువురు సమగ్రశిక్షాశాఖ సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.

నీటిలో నిలబడి నిరసన

- రోడ్డు మరమ్మతు చేపట్టాలని వినూత్న నిరసన


నీళ్లల్లో నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న స్థానికులు

వెదురుకుప్పం : 30 ఏళ్లుగా నరకయాతన పడుతున్నామని, రోడ్డు మరమ్మతు చేపట్టాలని కురివికుప్పం ఎస్సీ కాలనీ వాసులు రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిలో నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడారు. రోడ్డు అధ్వాన్నంగా ఉండడంతో అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రులకు వెళ్లాలంటే నరకయాతన పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం వస్తే రోడ్డుపై అడుగు తీసి అడుగు పెట్టలేకపోతున్నామంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రోడ్డును ఆధునికీకరించి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

రైతుల సమక్షంలోనే రీ సర్వే


భూ రీసర్వే పనులను పరిశీలిస్తున్న అధికారులు

నింద్ర : మండలంలో జరుగుతున్న మూడో విడత భూ రీసర్వే పనులను రైతుల సమక్షంలోనే చేయాలని సర్వే యర్ ల్యాండ్ రికార్డు జిల్లా అధికారి జయరాజ్ అన్నారు. బుధవారం నింద్ర మండలం కేఆర్ పాళెంలో జరుగుతున్న రీసర్వే పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రీసర్వేకు మందు ప్రతి రైతుకు ముందుగానే విషయం తెలిపి నోటీసులు అందించి వారి సమక్షంలోనే భూమిని సర్వే చేసి రికార్డులను తయారు చేయాలని ఆదేశించారు. సమావేశంలో నగరి డివిజన్ అధికారి ప్రసాద్ రావు, తహసీల్దార్ శేషగిరిరావు, మండల సర్వేయర్ వెంకటేశు, తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరులో భారీగా ఇసుక డంపింగ్

పుత్తూరు : పట్టణంలోని చర్చి కాంపౌండ్‌లో పెద్ద ఎత్తున ఇసుక డంపింగ్ చేసినట్లు బుధవారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. వందల టన్నుల ఇసుకను డంపింగ్ చేసి తమిళనాడుకు అక్రమంగా తరలించడానికి సిద్ధం చేశారంటూ ప్రచారం జరిగింది. పలువురు డంపింగ్ వద్దకు వెళ్లి ఫోటోలు తీశారు. సామాన్యులకు సాధారణంగా దొరకని ఇసుక ఒకేచోట వందల టన్నులను చూసి నివ్వెరపోవడం జరిగింది. పేదల ఇళ్ల నిర్మాణ పనులే జరగని నేపథ్యంలో ఇంత పెద్ద ఎత్తున ఇసుక డంపింగ్‌పై పట్టణంలో పెద్ద దుమారమే రేగింది. ఈ భారీ ఇసుక డంపింగ్‌పై జిల్లా ఉన్నతాధికారులు నిజానిజాలను తేల్చాల్సి ఉంది.

పేదలకు చెందిందే ఈ ఇసుక..

పుత్తూరు పట్టణం చర్చి కాంపౌండ్‌లో డంపింగ్ చేసిన ఇసుక హౌసింగ్ శాఖకు చెందింది. పేదల ఇళ్ల నిర్మాణం కోసం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సురక్షిత ప్రదేశంలో ఇసుకను డంపింగ్ చేశాం. పేదల ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభమైనప్పుడు ఈ ఇసుకను అందిస్తాం.

– సురేంద్ర, హౌసింగ్ ఏఈ, పుత్తూరు

టమా‘రా’

- నెలరోజులుగా బాక్సు రూ.200 దాటని ధర
- అన్నమయ్య, అనంతపురం జిల్లాల్లో భారీగా సరుకు
- ఉత్తరాది రాష్ట్రాలకు తగ్గిన ఎగుమతులు

పలమనేరు హార్టికల్చర్ డివిజన్‌లో సాగు వివరాలు

ఈ సీజన్‌లో టమాట సాధారణ సాగు 5 వేల హెక్టార్లు	ప్రస్తుతం సాగైన పంట 1500 హెక్టార్లు
కోత దశలో ఉన్న తోటలు 650 హెక్టార్లు	సీజన్‌లో మండీలకు వచ్చే సరుకు 110 లారీ లోడ్లు
ప్రస్తుతం మార్కెట్లకు చేరుతున్న సరుకు (పొరుగు జిల్లాల నుంచి కలిపి) 100 లోడ్లు	


పలమనేరు మార్కెట్‌కు వచ్చిన టమాట

పలమనేరు : జిల్లాలో టమాట ధర గత నెల రోజులుగా బాక్సు రూ.200 దాటడంలేదు. దీంతో టమాట రైతులకు నష్టాలు తప్పడం లేదు. ఎప్పుడు ధర పెరుగుతుందో.. ఎప్పుడు తగ్గుతుందో అర్థం గాని పరిస్థితి నెలకొంది. గత నెల మొదటి వారంలో బాక్సు(14 కిలోలు) రూ.200 దాకా ఉన్న ధరలు ఇప్పటికీ అదే కొనసాగుతున్నాయి. పలమనేరు మార్కెట్‌లో బుధవారం సైతం బాక్సు ధర రూ.200 మాత్రమే. జిల్లా నుంచి ఎగుమతులు తగ్గడం, పొరుగు జిల్లాలో భారీగా టమాటలు రావడంతో ధరల పతనానికి కారణమని వ్యాపారులు చెబుతున్నారు.

పొరుగు జిల్లాల నుంచి భారీగా సరుకు

జిల్లాలోని పడమటి మండలాల్లో సీజన్‌తో సంబంధం లేకుండా టమాటను రైతులు సాగు చేస్తుంటారు. పలమనేరు హార్టికల్చర్ డివిజన్‌లో పలమనేరు, పుంగనూరు, వీకోట, సోమల, సదుంలలో టమాట మార్కెట్లున్నాయి. ఇలా ఉండగా ప్రస్తుతం అన్నమయ్య, అనంతపురం, పుట్టపర్తి, కర్ణాటకలోని కోలారు, చింతామణి, శ్రీనివాసపుర ప్రాంతాల నుంచి భారీగా సరుకు ఇక్కడి మార్కెట్లకు చేరుతోంది. స్థానికంగా పంట దిగుబడులు తక్కువగా ఉన్నప్పటికీ పొరుగు జిల్లాల నుంచి సరుకు ఎక్కువగా రావడంతో ధరలు తగ్గుముఖం పడుతున్నాయి.

తగ్గిన ఎగుమతులు

ఉమ్మడి చిత్తూరు, అనంతపురం జిల్లాల నుంచి ఎక్కువగా టమాటను తమిళనాడు, చత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, వెస్ట్ బెంగాళ్, తెలంగాణ రాష్ట్రాలకు ఎగుమతులు చేసేవారు. అయితే ఆయా రాష్ట్రాల్లో లోకల్ సరుకు అందుబాటులో ఉంది. దీంతో ఆ రాష్ట్రాలకు ఇక్కడి సరుకు వెళ్లడం లేదు. తమిళనాడు వ్యాపారులు మాత్రమే జిల్లాలోని మార్కెట్లకు వస్తున్నారు. ఇక్కడి నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు సరుకును విక్రయించే వ్యాపారులు రావడం లేదు. దీంతో ధరల తగ్గుదలకు కారణంగా మారింది.

ధరలు పెరిగే అవకాశం



స్థానికంగా సరుకుతో సంబంధం లేకుండా డిమాండ్‌కు మించి సప్లయ్ ఉంటే ధరలు తగ్గుతాయి. ప్రస్తుతం పొరుగు జిల్లాలో టమాట ఎక్కువగా ఉంది. వర్షాలు ఎక్కువగా లేకుంటే నవంబరులో ధర పెరిగే అవకాశం ఉంటుంది.

– డా. కోటేశ్వరావు, ఉద్యానశాఖ సహాయసంచాలకులు

బాక్సు రూ.300 పలికితేనే గిట్టుబాటు



సీజన్‌తో సంబంధం లేకుండా ఏటా టమాట సాగు చేస్తుంటా. ప్రస్తుతం రెండెకరాల్లో టమాట కోత కొచ్చింది. పెరిగిన కూలీలు, పంట పెట్టుబడుల నేపథ్యంలో బాక్సు ధర రూ.300 పలికితే రైతుకు నష్టం రాకుండా ఉంటుంది. దానిపైన ధరలుంటే నాలుగు రూపాయలు మిగులుతుంది. ఇప్పుడున్న బాక్సు రూ.200తో నష్టం తప్పదు.

– రవీంద్రారెడ్డి, టమాట రైతు, కూర్మాయి